క్లుప్తంగా

19న రేణుక ఎల్లమ్మ రథోత్సవం


రేణుక ఎల్లమ్మ దేవాలయం

తాండూరు రూరల్: భక్తుల కొంగు బంగారమైన రేణుక ఎల్లమ్మ జాతర ఈ నెల 19 నుంచి నెల రోజుల పాటు జరగనుంది. కోత్లాపూర్‌లో వెలసిన రేణుక ఎల్లమ్మ ఉత్సవానికి తెలంగాణలోని పలు జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున రానున్నారని ఆలయ కమిటీ తెలిపింది.

ఉద్యోగ భద్రత కల్పించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

కొడంగల్: ఉద్యోగ భద్రత కల్పించాలని నియోజకవర్గ వీఆర్‌ఏలు మంగళవారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వేతనాలు ఇవ్వాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కో కన్వీనర్ గోపాల్, మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి కృషి

అనంతగిరి: అవసరాలకు అనుగుణంగా వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మీతో నేను కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన వికారాబాద్ పట్టణంలోని 10వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని, రోడ్డు మధ్యలో, ఖాళీగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, అవసరమైన చోట కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. శిథిలావస్థలకు చేరిన ఇళ్లను తొలగించాలని సంబంధిత అధికారులకు చెప్పారు. సీసీరోడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఆయన వెంట కౌన్సిలర్, నాయకులు ఉన్నారు.

సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి


శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడిగా ఎబ్బనూర్ గ్రామ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంతకు ముందున్న అధ్యక్షుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. ఈ ఎన్నిక అనివార్యం అయింది. ఈ మేరకు వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆనంద్ శ్రీకాంత్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అపాయంలో ఉపయోగం కరాటే..


ప్రశంసాపత్రం అందుకుంటున్న మాస్టర్

పూడూరు: ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో తోడ్పడుతుందని చన్గోముల్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కరాటే శిక్షణ కార్యక్రమంలో ఎస్‌ఐ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు కరాటే నేర్చుకోవాలని, అపాయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు, బాలికలు, మహిళలు కరాటే నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన మాస్టర్ బ్రహ్మాచారికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, తహసీల్దార్ మోహన్, మాస్టర్ జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఫౌండర్ ఎండీ ఖాజాపాషా, ట్రెడిషనల్ జపాన్ షోటాఖాన్ అసోసియేషన్ ఇండియా ఫౌండర్ జాజుల శ్రీనివాస్, నర్సింహ, మాస్టర్లు శ్రీనివాస్, బ్రహ్మం, విజయ్, జంగయ్య, రాములు, కృష్ణ, మాణిక్‌నాయక్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో తాండూరు

సబ్ డివిజన్ పరిధిలో 750 సీసీ కెమెరాలు
- అందుబాటులోకి కమాండ్ కంట్రోల్ రూం
- సీసీల ఏర్పాటుకు సీడీఎఫ్ నిధులు మంజూరు
- రూ.70 లక్షలతో మొదలైన పనులు


సీసీలు ఏర్పాటు చేస్తున్న టెక్నీషియన్‌లు

తాండూరు: శాంతి భద్రతల పర్యవేక్షణలో పోలీసు శాఖకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయి. అందులో భాగంగా ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరిగినా క్షణాల్లో నిందితులను గుర్తించే విధంగా సాంకేతిక సేవలను ఆ శాఖ అందుబాటులోకి తెస్తోంది. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవతో తాండూరు సబ్ డివిజన్ పరిధిలో సీడీఎఫ్ నిధుల మంజూరు చేయగా.. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీల ఏర్పాటుతో పాటు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు పనులు మొదలయ్యాయి. తాండూరు పట్టణం, యాలాల, కరన్‌కోట్, పెద్దేముల్, బషీరాబాద్ మండలాల పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని 36 మున్సిపల్ వార్డుల్లో సీడీఎఫ్ నిధులు రూ.70లక్షలతో సీసీ కెమెరాలు బిగించడంతో పాటు.. స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నారు. పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఇప్పటికే ఇందిరాచౌక్, రైల్వే స్టేషన్, గాంధీచౌక్, శివాజీ చౌక్, అంబేడ్కర్ చౌక్ లాంటి ప్రధాన కూడళ్లలో సీసీలు ఏర్పాటు చేశారు. మరో వారం రోజుల్లో సబ్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. కమాండ్ కంట్రోల్ రూమ్ అందుబాటులోకి రాగానే ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు పోలీసులు చెప్పారు.

నాలుగేళ్ల క్రితం..

సబ్ డివిజన్ పరిధిలో నాలుగేళ్ల క్రితం సీసీ కెమెరాల ద్వారా శాంతి భద్రతల నిఘా పర్యవేక్షణ మొదలైంది. నాటి పోలీసు అధికారులు నేను సైతం, మేము సైతం కార్యక్రమాలతో సీసీల ఉపయోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కెమెరాల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని పరిశ్రమల యాజమాన్యాలను కోరగా.. సిమెంట్ కంపెనీల యజమానులు రూ.లక్షలు విరాళంగా అందజేశారు. దీంతో తాండూరు పట్టణ కూడళ్లతో పాటు, పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. నాడు ఏర్పాటు చేసిన 400 సీసీ కెమెరాలు వర్షాలకు పాడైపోగా.. తాజాగా మరోసారి రూ.లక్షలు వెచ్చించి సీసీ కెమరాలు ఏర్పాటు చేస్తున్నారు. నిఘా వ్యవస్థ అందుబాటులోకి వస్తే నేరాలు పూర్తిగా తగ్గుతాయని, అంతే కాకుండా నేరాలకు పాల్పడాలనుకునే వారికి భయం ఉంటుందని పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు సహాయక కేంద్రం


సహాయక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్లు

తాండూరు: 2023–24 విద్యా సంవత్సరం డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించేందుకు దోస్త్ సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.రవీందర్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి సహాయక కేంద్రాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. సింగిల్ విండో వెబ్‌సైట్ ద్వారా డీఓఎస్‌టీ.సీజీజీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలు కల్పించామని, అడ్మిషన్ల విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే సహాయక కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వివరాల కోసం 9885583432, 9441162369 నంబర్లను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు మహేందర్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన స్థలాన్ని కాపాడండి


తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకొని, బీసీ కమ్యూనిటీ భవన స్థలాన్ని కాపాడాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, గౌడ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణయ్య, ఎంపీటీసీ ఆనందంలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ రమేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్‌ను తప్పుగా చూపిస్తూ అక్రమ నిర్మాణానికి తెరలేపిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం, నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు రాజేశ్వర్, రమేష్, సంతోష్, వెంకటయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై ఆడిట్


పెద్దేములలో ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

పెద్దేముల్: 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 37 మహిళా గ్రామ సంఘాల ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ జరగనుందని ఆడిటర్ రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉరేంటితండా, పాషాపూర్, హన్మాపూర్, గిర్మాపూర్, గొట్లపల్లి, ఇందూరు, గాజీపూర్, బుద్దారం, ఖాణాపూర్, పెద్దేముల్, బండపల్లి, దుగ్గాపూర్, కొండాపూర్, రేగొండి, చైతన్యగనర్‌తో పాటు మొత్తం 15 జీపీల రూ.18 లక్షల సామాజిక (సీఎఫ్‌ఐ) పెట్టుబడి, రూ.78 లక్షలు శ్రీనిధి, రూ.13 కోట్లు బ్యాంకు లింగేజిపై ఆడిట్ జరిగిందని తెలిపారు. మూడు రోజుల పాటు రూ.23 కోట్ల బ్యాంకు లింకేజి, రూ.3 కోట్లు శ్రీ నిధి, రూ.32 లక్షలు సామాజిక పెట్టుబడి నిధిపై గడిచిన ఆర్థిక సంవత్సర లావాదేవిలపై ఆడిట్ జరగనుందని వెల్లడించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, ఏపీఎం బాలయ్య, అకౌంటెడ్ దేవనూరు లక్ష్మి, మండల సీసీలు సత్యనారాయణ, అనంతయ్య, వెంకటేశం, సయ్యద్, లక్ష్మయ్య, స్వప్న, నర్సమ్మ, మంజుల, వీరప్ప, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి


కొడంగల్ రూరల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సయ్యద్ అంజద్ తదితరులు

కొడంగల్ రూరల్: ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యం విక్రయించాలని సర్పంచ్ సయ్యద్ అంజద్ చెప్పారు. మంగళవారం పర్సాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందమ్మ, ఉప సర్పంచ్ మొగులయ్య, నాయకులు శ్రీనివాస్, జనార్దన్, హన్మంతు, మహిళా సంఘం సభ్యులు, రైతు సమన్వయ సమితి సభ్యులు పాల్గొన్నారు.

దోమలో..

దోమ: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. దోమ మండలం ఊటుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ మామిళ్ల నర్సింహులుతో కలిసి వారు ప్రారంభించి మాట్లాడారు. దళారులను ఆశ్రయించి రైతులు మోసపోద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ దాతన్న గారి ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి లాల్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ అనంతలక్ష్మి, పాఠశాల చైర్మన్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు 'కంటివెలుగు'


నేత్ర శిబిరాన్ని ప్రారంభిస్తున్న నేతలు, అధికారులు

కుల్కచర్ల: అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని మందిపల్ సర్పంచ్ మతం ప్రమీల అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి చూపు సమస్య ఉన్నవారు నేత్ర శిబిరాన్ని వినియోగించుకోవాలని, వైద్య పరీక్షల అనంతరం వైద్యులు ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి స్వరూప, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహులు, నాయకుల మతం రాజశేఖర్, బాలరాజ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ శ్యాంకుమార్ అన్నారు. మిట్టకంకల్‌లో నేత్ర శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. అంధత్వ నివారణ కోసమే కంటివెలుగు అని, కంటి జబ్బు ఉన్నవారు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

హెల్మెట్ వాడకపోవడంతోనే మరణాలు!

పరిగి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని సీఐ వెంకటరామయ్య అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించి, హెల్మెట్ లేని 300 మంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు మృత్యువాత పడుతున్నారని, అందుకు కారణం హెల్మెట్ పెట్టుకోకపోవడమే అని చెప్పారు. ఇంతటి నిర్లక్ష్యం పనికిరాదని, హెల్మెట్ పెట్టుకొని, సురక్షిత ప్రయాణం చేయాలన్నారు. లేని యెడలా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై విఠల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటరామయ్య

అపరిశుభ్రతకు నిలయాలు!

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం నిర్మించిన రైతు వేదికలు అపరిశుభ్రతకు నిలయాలుగా నిలిచాయి. వేదిక నిర్వహణకు ప్రభుత్వం నెలనెలా నిధులు విడుదల చేస్తున్నప్పటికీ.. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడి, నిర్వాహకుల నిర్లక్ష్యంతో చెత్తచెదారంతో నిండిపోయి ఉంటున్నాయి. మండలంలోని కరన్‌కోట్, బెల్కటూర్, నారాయణపూర్, అంతారం, చెంగోల్, సిరిగిరిపేట్, ఐనెల్లి క్లస్టర్లలో నిర్మించిన వేదికల్లో వ్యవసాయ (ఏఈఓలు)అధికారులు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి, సాగుకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇవ్వాలి. కానీ సమీక్షల సంగతి ఎలా ఉన్నా.. వేదికలు, అందులోని సామగ్రి దుమ్ముధూళితో నిండిపోయి బూత్ బంగ్లాలను తలపిస్తున్నాయి. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు తగిన చర్యలు తీసుకొని రైతు వేదికల సంరక్షణచేపట్టాలని పరిసరప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్ష

పెద్దేముల్: తట్టెపల్లి గ్రామ పంచాయతీని నూతన మండలముగా ప్రకటించాలని తట్టెపల్లి సాధన కమిటీ సభ్యులు చేపట్టిన నిరసన దీక్ష మంగళవారం నాటికి 40వ రోజుకు చేరింది. జైరాంతండా, తట్టెపల్లి, బండమీదిపల్లి, ఓంలా నాయక్‌తండాతో పాటు పలు గ్రామాల ప్రజలు తట్టెపల్లి అంబెడ్కర్ వద్ద నిరసన తెలిపారు. తట్టెపల్లిని మండలముగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఏపీఎం సురేశ్

దోమ: చిన్న, మధ్య తరగతి ప్రజలు ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సురేశ్ చెప్పారు. మంగళవారం మండల మహిళా సమాఖ్య భవనంలో స్కీం పై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆర్‌ఎం అశ్విన్, ఎంపీఓ సురేశ్ పాల్గొని స్కీం ఉపయోగాలను వివరించారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఈ పథకం కింద పిండి, కారం పొడి, పప్పు దినుసుల గిర్నీలు, దాల్‌మిల్, రైస్‌మిల్, పచ్చళ్ల తయారీ, అల్లంవెల్లుల్లిపేస్ట్, బేకరి వస్తువులు తయారు చేసే పరికాలు 35శాతం సబ్సిడీ ద్వారా అందుబాటులో ఉంటాయని తెలిపారు. అవసరమైన వారు ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, సీసీలు జంగయ్య, నారాయణ, లక్ష్మారెడ్డి, నర్సింహులు, జంగప్ప పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సకల సౌకర్యాలు


అంగన్‌వాడీ కార్యకర్తలకు మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ

పరిగి: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తుందని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. మంగళవారం పరిగి, దోమ, కుల్కచర్ల మండలాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు మెడికల్ కిట్లు అందజేసి మాట్లాడారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రథమ చికిత్స చేసేందుకు ఈ కిట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని, ఇందులో పలు రకాల ఔషధాలు ఉంటాయని చెప్పారు. అంతే కాకుండా చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు, చదువు, ఆటలు నేర్పించడంలో అంగన్‌వాడీల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ప్రియదర్శిని, ఎంపీడీఓ శేషగిరిశర్మ, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు ఎప్పుడు కాటేస్తాయో!

ధారూరు: ఇళ్లపైన విద్యుత్ తీగలు వేలాడుతుంటే భయమేస్తుందని, అవి ఎప్పుడు తెగి ఇళ్లపై పడతాయో, ఎవరిని బలితీసుకుంటాయోనని అల్లీపూర్ గ్రామస్తులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. మంగళవారం విద్యుత్ బిల్లుల వసూలుకు వచ్చిన ట్రాన్స్‌కో సిబ్బందితోనూ ఇదే విషయమై పలువురు వాగ్వాదానికి దిగారు. ఇళ్లపై వేలాడుతున్న త్రీఫేజ్ తీగలను తొలగించాలని పలుమార్లు విద్యుత్ అధికారులను ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. వేలాడుతున్న తీగలు గాలి వీచినప్పుడు ఇంటి పై కప్పుకు తగులుతున్నాయని, ఇంటిపైకి ఎక్కాలంటే భయం వేస్తుందన్నారు. ఈ సమస్యను పలు మార్లు విద్యుత్ అధికారులకు, ఎమ్మెల్యేకు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా కలెక్టర్ నారాయణరెడ్డి సారు చొరవ తీసుకొని వర్షాకాలం రాకముందే వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


ఇళ్లపై నుంచి విద్యుత్ లైన్. (ఇన్‌సెట్లో) ఓ ఇంటి పైకప్పును తాకేలా ఉన్న విద్యుత్ తీగలు

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం


అనంతగిరి: క్రీడోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


బషీరాబాద్: వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎంపీపీ కరుణ

- మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకే సీఎం కప్–2023
- క్రీడోత్సవాల ప్రారంభంలో ప్రజాప్రతినిధులు

అనంతగిరి: క్రీడాకారులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం కల్పిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మండలం నారాయణపూర్ తెలంగాణ క్రీడా మైదానంలో రెండో రోజు సీఎం కప్ ఆటల పోటీలు ప్రారంభం కాగా.. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడంతో పాటు, వారికి తగిన ప్రోత్సాహం అందించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని చెప్పారు. ఈ టోర్నీలో రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడాభివృద్ధికి, క్రీడాకారులకు తనవంతు సహాయసహకారాలు ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఓ తరుణ్‌కుమార్, ఎంపీపీ చంద్రకళ, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ రాంరెడ్డి, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యం వెలికి తీయడానికి ఈ పోటీలు దోహదపడతాయని ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ ఆటల పోటీల్లో విజేతగా నిలిచిన వారికి ఆమె బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుజాత, వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ షఫీఉల్లా, తహసీల్దార్ భువనేశ్వర్, ఎస్‌ఐ సంతోష్‌కుమార్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఖోఖో పురుషుల విభాగంలో విన్నర్‌గా తరిగోపుల, రన్నర్‌గా రాంపూర్‌తండా, ఫుట్‌బాల్‌లో విజేతగా నాగసమందర్ నిలిచింది. వాలీబాల్‌లో విన్నర్‌గా తరగోపుల, రన్నర్‌గా నాగారం, కబడ్డీలో విజేతగా రాంపూర్‌తండా, రన్నర్‌గా ధారూరు, 100 మీటర్ల పరుగుపందెంలో తరిగోపుల, కేరెల్లి విద్యార్థులు, 400 పరుగు పందెంలో తరిగోపుల, కబడ్డీ బాలికల విభాగంలో రుద్రారం మొదటి స్థానంలో నిలిచింది.

క్రీడలతో మానసికోల్లాసం

బషీరాబాద్: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎంపీపీ కరుణ అన్నారు. బషీరాబాద్ మండల కేంద్రంలో సీఎం కప్‌లో క్రీడల్లో భాగంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు.